ప్రజాశక్తి
గురువారం 2 నవంబర్ 2023 5

శ్రీ సత్యసాయి

జెఎన్‌టియు ఎంటెక్, ఎం.ఫార్మసీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిధిలో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో నిర్వహించిన ఎంటెక్ సెకండ్ సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ పలితాలు, ఎంటెక్ థర్డ్ సెమిస్టర్ (ఆర్-21), (ఆర్-17) సప్లిమెంటరీ పలితాలు, ఎంటెక్ ఫస్ట్ సెమిస్టర్ (ఆర్-21), (ఆర్-17) సప్లిమెంటరీ పలితాలు, ఎం.టెక్ సెకండ్ సెమిస్టర్ (ఆర్-17) సప్లిమెంటరీ పలితాలు, ఎం.ఫార్మసీ సెకండ్ సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్, సప్లిమెంటరీ పలితాలు, ఎం.ఫార్మసీ థర్డ్ సెమిస్టర్ (ఆర్-21), (ఆర్-17) సప్లిమెంటరీ పలితాలు, ఎం.ఫార్మసీ సెకండ్ సెమిస్టర్ (ఆర్-17) సప్లిమెంటరీ ఫలితాలు, ఎం.ఫార్మసీ ఫస్ట్ సెమిస్టర్ (ఆర్-21), (ఆర్-17) సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ ఆచార్య బి.చంద్రమోహన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం JNTUA వెబ్ సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని తెలిపారు.

కల్లూరులో అధికారులు కూల్చివేసిన పేదల నివాసాలు

ఇంటిని కూల్చేయడంతో రోదిస్తున్న వృద్ధురాలు

- కల్లూరులో పేదల ఇళ్లు కూల్చివేత
- రెవెన్యూ, పోలీసు అధికారుల దుశ్చర్య
- అడ్డుకున్న సిపిఎం నాయకులపై లాఠీఛార్జీ
- బలవంతపు అరెస్టులు..
- సిఐ ఓవరాక్షన్

పేదలపై.. 'అధికార' కర్కశత్వం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెల తొలగింపు కార్యక్రమాలను అధికారులు యథేచ్ఛగా చేస్తున్నారు. ఒక ప్రాంతం ఘటన మరువక ముందే మరొక ప్రాంతంలో జెసిబిలతో గుడిసెలను తొలగిస్తూ వారి కర్కశత్వాన్ని చాటుకుంటున్నారు. తాజాగా అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో పేదల వేసుకున్న ఇళ్లు, గుడిసెలను రెవెన్యూ, పోలీసు అధికారులు బుధవారం వేకువజామున జెసిబిలో తొలగించేశారు. దీనిని అడ్డుకున్న సిపిఎం నాయకులపైనా పోలీసులు లాఠీఛార్జి చేసి, బలవంతంగా అరెస్టులు చేశారు. గుడిసెలు కూల్చొద్దంటూ పేదలు ప్రాధేయపడినా కనికరం లేకుండా అధికారులు వాటిని కూల్చిపడేశారు. దీంతో పేదలు కన్నీరుమున్నీరుగా విలపించారు. కట్టుబట్టలతో నిలువనీడ కోల్పోయి పేదలు రోడ్డునపడ్డారు.

ప్రజాశక్తి-గార్లదిన్నె, అనంతపురం కలెక్టరేట్

గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామ పంచాయతీ సర్వేనెంబర్ 165లో గల ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. గత 30 సంవత్సరాలుగా ఇళ్లు లేని నిరుపేదలు దాదాపు 200 కుటుంబాలు నాలుగేళ్ల క్రితం ఇక్కడ గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. అక్కడే తమకు నివాస స్థల పట్టాలు ఇవ్వాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు. అయినా ఎవరూ స్పందించలేదు. ఈ భూమి దేవాదాయ శాఖకు చెందినదని దానిని ఖాళీ చేయాలంటూ పలుమార్లు అధికారులు బెదిరింపులకు దిగారు. దీంతో పేదలు న్యాయం కోరుతూ కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన విచారణ కోర్టులో జరుగుతోంది. ఈ విచారణ జరుగుతుండగానే పోలీసులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే బుధవారం వేకువజామున పెద్ద సంఖ్యలో ప్రభుత్వ అధికారులు, ప్రయివేటు వ్యక్తులు జెసిబిలను తీసుకుని వచ్చి గుడిసెల కూల్చివేతకు సిద్ధపడ్డారు. ఏమి జరుగుతుందో తెలియక పేదలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. గుడిసెల్లో నిత్యావసర వస్తువులు, ఇతర సామగ్రి ఉన్నాయని, తొలగించొద్దంటూ ప్రాదేయపడినా వినకుండా ఇష్టం వచ్చినట్లు కూల్చిపడేశారు.

అడ్డుకున్న సిపిఎం.. పోలీసుల లాఠీఛార్జి.. నాయకుల అరెస్టు

కల్లూరు గ్రామంలో పేదల గుడిసెలు తొలగిస్తున్న విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ గార్లదిన్నె మండల కార్యదర్శి చెన్నారెడ్డి, రైతుసంఘం నాయకులు నాగరాజుతో కలిసి ఆ ప్రాంతానికి హుటాహుటిన వెళ్లారు. గుడిసెల తొలిగింపును అడ్డుకునే ప్రయత్నం చేశారు. పేదల గుడిసెలు ఎలా తొలగిస్తారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడ సిబ్బందితో కలిసి ఉన్న ఇటుకలపల్లి సిఐ నరేందర్‌రెడ్డి సిపిఎం నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరుషపదజాలంతో దూషించారు. లాఠీఛార్జి సైతం చేశారు. అక్కడ ఉండేందుకు వీల్లేదంటూ రాంభూపాల్‌తో పలువురు సిపిఎం నాయకులను బలవంతంగా అరెస్టు చేసి బుక్కరాయసముద్రం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

నివాసాలు కోల్పోయిన పేదలకు న్యాయం చేసి, అనుచితంగా ప్రవర్తించిన ఇటుకలపల్లి సిఐపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అనంత ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

పేదల కన్నీటి రోదన

ఒక్కసారిగా అధికారులు గుడిసెలు తొలగించడంతో పేదలు కకావికలం అయ్యారు. 'సారూ మా గుడిసెలు తొలగించొద్దంటూ రెవెన్యూ, పోలీసు అధికారులను ప్రాధేయపడ్డారు. అయినా కనికరం చూపని అధికారులు గుడిసెలను కూల్చివేశారు. కష్టపడి నిర్మించుకున్న గుడిసెలను కళ్లేదుటే కూల్చివేయడాన్ని చూసి పేదలు గుండెలు అవిసేలా రోదించారు. నిత్యావసర వస్తువులు, సామగ్రి ధ్వంసం అయ్యింది. కట్టుబట్టలతో 200 కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అప్పడే పుట్టిన పసికందును సైతం చేతుల్లో ఎత్తుకుని బాలింతలు రోడ్డుపైకి రావాల్సిన పరిస్థితి దయనీయ పరిస్థితి నెలకొంది.

పై ఫొటోలో కన్పిస్తున్న ఇద్దరు మహిళలు ప్రస్తుతం అధికారులు కూల్చివేసిన ప్రాంతంలో నివసిస్తున్న వారు. వీరిలో ఒకరు నిండు గర్భిణి కాగా, మరొకరు 20 రోజుల బాలింత. ఇలాంటి వారున్న ఈ ప్రాంతంలో అధికారులు ఎంత దయనీయంగా, నిర్దాక్షిణ్యంగా వ్యవహరించారనడానికి ఈ మహిళలే నిలువెత్తు సాక్షాలుగా నిలుస్తున్నారు. 'సార్.. మా గుడిసెలు కూల్చి మమ్మల్ని రోడ్డున పడేయొద్దంటూ' వేడుకున్నా అధికారులు కనికరించకుండా ఎంత క్రూరంగా వ్యవహరించారో అర్థం చేసుకోవచ్చు.

తహశీల్దార్, ఆర్డీవో కార్యాలయాల వద్ద ధర్నా

పేదల ఇళ్లు, గుడిసెల తొలగింపు, సిపిఎం నాయకులపై సిఐ అనుచిత ప్రవర్తనను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. గార్లదిన్నె తహశీల్దార్ కార్యాలయం, అనంతపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళనలు కొనసాగించారు. అనంతపురం ఆర్డీవో కార్యాలయం వద్ద అధికారులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆర్డీవోను కార్యాలయం లోపలికి వెళ్లనీయకుండా ఘెరావ్ చేశారు. కొద్దిసేపటి తరువాత ఆర్డీవో సిపిఎం నాయకులతో చర్చలు జరిపారు. పేదలకు యథాస్థానంలో పట్టాలు ఇవ్వాలని, పేదలు, సిపిఎం నాయకులపై అనుచితంగా ప్రవర్తించిన సిఐ నరేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ పేదలకు న్యాయం చేసేలా తాను చర్యలు తీసుకుంటానని చెప్పి ఆందోళన విరమింపజేశారు.

పేదల ఇళ్ల కూల్చివేతలో ఎమ్మెల్యే హస్తం

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎ.గఫూర్

కల్లూరు గ్రామంలో పేదల గుడిసెలు, ఇళ్ల తొలగింపులో స్థానిక ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి హస్తం ఉందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఎం.గఫూర్ తెలిపారు. రెవెన్యూ, పోలీసు అధికారులు కూల్చివేసిన ఇళ్లను బుధవారం సాయంత్రం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జి.ఓబులు తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఓ వైపు ప్రతి నిరుపేదకూ ఇల్లు ఇస్తామని చెబుతూ ఆచరణలో మాత్రం పేదలు కట్టుకున్న ఇళ్లను జెసిబిలతో కూల్చివేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకింత కక్షో అర్థం కావడం లేదన్నారు. పేదలకు ప్రత్యామ్నాయ స్థలం చూపేంత వరకు నివాసాలను తొలగించరాదని కోర్టు స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ కల్లూరులో యథేచ్ఛగా అధికారులు కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారన్నారు. నిజంగా ప్రభుత్వానికి దేవాదాయ శాఖ భూములు కాపాడాలనే ఉద్దేశంతో ఉంటే ప్రస్తుతం పేదల ఇళ్లు కూల్చివేసిన స్థలానికి ఆనుకుని వైసీపీ నాయకుడు ఆక్రమించుకున్న 90 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అధికారులు వైసిపి నాయకులకు ఒక న్యాయం, పేదలకు ఒక న్యాయం అమలు చేయడం దుర్మార్గంగా ఉందన్నారు. పేదల ఇళ్లు కూల్చివేతపై పూర్తిగా ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి వెంటనే ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ప్రస్తుతం కూల్చివేతకు సంబంధించి ప్రతి ఒక్క పేద కుటుంబానికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో పేదల పక్షాన పెద్ద ఎత్తున పోరాటం చేస్తామన్నారు.

ఎమ్మెల్యే బాధ్యత వహించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

గార్లదిన్నె మండలం, కల్లూరు గ్రామంలో పేదలు వేసుకున్న గుడిసెలను పోలీసులు వైఎస్ఆర్‌సిపి నేతల సమక్షంలోనే తొలగించారని, ఇందుకు శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బాధ్యత వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే పద్మావతి ఆదేశాలు లేనిదే గుడిసెలు కూల్చివేత జరగదన్నారు. పేదలకు జరిగిన నష్టానికి ఎమ్మెల్యే బాధ్యత వహించి వారికి పరిహారంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. పేదలు నిర్మాణం చేసుకున్న ఇళ్లను ఖాళీ చేయించాల్సి వస్తే వారికి ప్రత్యామ్నాయం స్థలాలు చూపించి, నోటీసులు ఇచ్చిన తరువాతనే ఖాళీ చేయించాలని కోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఆవేవి పరిగణలోకి తీసుకోకుండా రెవెన్యూ, పోలీసు అధికారులు వైసిపి నాయకుల సమక్షంలో గుడిసెలు తొలగించి ప్రజలను రోడ్ల పాలు చేశారని తెలిపారు. పోలీసులు వైసిపి కార్యకర్తలుగా వ్యవహరించడం సిగ్గు చేటుగా ఉందన్నారు. సిఐ నరేంద్ర రెడ్డి దురుసుగా వ్యవహరించి ప్రజలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. తక్షణం సిఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పేదలకు నష్టపరిహారం అందేలా ఎమ్మెల్యే బాధ్యత తీసుకోవాలని కోరారు. పేదలకు న్యాయం జరిగేంత వరకు వారి పక్షాన సిపిఎం ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని రాంభూపాల్ తెలియజేశారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణత్యాగం ఎప్పటికీ మరువలేనిదని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను బుధవారం నాడు కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు మడకశిర ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. పోలీస్ గౌరవ వందన స్వీకరణ అనంతరం పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక సాయి ఆరామంలో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాధవరెడ్డి, జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర కోసం 58 రోజులపాటు పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణ త్యాగంతో ఆంధ్ర రాష్ట్రం సాధించారని గుర్తు చేశారు. అనునిత్యం సత్యం, అహింస మార్గాన్ని అమరజీవి పాటించేవారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని తెలిపారు. నాడు-నేడు ద్వారా పాఠశాలల అభివద్ధి ఆసుపత్రుల నిర్మాణాలు తోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష మాధుర్యాన్ని తెలుగుజాతి ఔన్నత్యాన్ని వివరిస్తూ ఎందరో త్యాగధనుల ఫలితంగానే నేడు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు. అనంతరం విద్యార్థులు ఆలపించిన గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక బందానికి ముఖ్య అతిథుల చేతులమీదుగా బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, పిఆర్‌ఎస్‌సి గోపాల్ రెడ్డి, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

తాడిపత్రిలో ప్రజారక్షణభేరియాత్రకు స్వాగతం పలుకుతున్న సిపిఎం నాయకులు

- రాష్ట్రానికి అన్యాయం జరుగుతున్నా మౌనమే..
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుతో ప్రజలకు నష్టం
- తాడిపత్రి, గుత్తి సిపిఎం ప్రజారక్షణభేరియాత్రలో సిపిఎం నాయకులు
- అనంతలో బస్సుయాత్రకు ఘనస్వాగతం

రాష్ట్రంలో మోడీని ప్రశ్నించలేని పార్టీలు

ప్రజాశక్తి-తాడిపత్రి

విభజన, ఎన్నికల హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి అడుగడుగునా మోసం చేస్తున్నా ప్రధాని నరేంద్ర మోడీని ప్రశ్నించలేని స్థితిలో రాష్ట్రంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు ఉన్నాయన్నారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర బుధవారం సాయంత్రం అనంతపురం జిల్లాకు చేరుకుంది. కడప జిల్లా మీదుగా జిల్లాలోకి ప్రవేశించిన యాత్ర తాడిపత్రి నుంచి గుత్తి వరకు కొనసాగింది. తాడిపత్రి, గుత్తి పట్టణాల్లో నిర్వహించిన బహిరంగ సభల్లో నాయకులు ప్రసంగించారు. బస్సుయాత్ర బందానికి స్థానిక సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. కడప సరిహద్దు ప్రాంతం నుంచి మోటార్ బైక్ ర్యాలీగా స్వాగతం పలికారు. తాడిపత్రిలోని దినసరి కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక వరకు ర్యాలీ కొనసాగింది. అక్కడ ప్రజానాట్య మండలి కళాకారులు పాటలు పాడి నృత్యాలు ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, వి.కృష్ణయ్య, ఉమామహేశ్వరరావు, రాష్ట్ర నాయకులు రమదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తాడిపత్రిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కోటి మంది స్కీమ్ వర్కర్లను విధుల నుంచి తొలగించే కుట్రకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పూరుకుటోందని చెప్పారు. 33 లక్షల మంది పిల్లలకు పోషకాహారం అందించలేని పరిస్థితిలో కేంద్రం ఉండడం సిగ్గుచేటన్నారు. నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వ విద్యను నీర్వర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానని, నల్ల డబ్బును తెప్పించి పేదల అకౌంట్లో రూ.15 లక్షల వేస్తానని నమ్మించి ఓట్లు వేయించుకున్న నరేంద్ర మోడీ వాటిలో ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరాభారాలతో ప్రజలు సతమతం అవుతున్నా మోడీకి చీమకుట్టినట్లు అయినా లేదన్నారు. అదానీ, అంబానీలకు చిన్న ఇబ్బంది కలిగినా మోడీ తక్షణం స్పందిస్తారని, పేదవారు కష్టాల్లో ఉంటే మాత్రం కనీసం పట్టించుకునే పరిస్థితి కూడా ఆయనకు లేదని ఎద్దేవా చేశారు. విజయనగరంలో రైలు ప్రమాదం జరిగి 14మంది మరణిస్తే మోడీకి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. బిజెపి అధికారంలో ఉంటే దేశం అధోగతిపాలవుతుందన్నారు. కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక పాలనను సాగిస్తున్న బిజెపిని ప్రజలు అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్లుగా మహిళలు, పసిపిల్లలకు రక్షణ కల్పించ లేక విఫలం చెందిన బిజెపి ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లును ఇప్పుడు తేవడం ఓట్ల కోసమే అన్నారు. మోడీ చేస్తున్న అన్యాయాన్ని రాష్ట్రంలో ఏ పార్టీ నాయకులూ ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మోడీ అడుగులకు మడుగులొత్తుతూ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందన్నారు. అంగన్వాడీలకు తెలంగాణ కంటే వెయ్యి రూపాయల అధికంగా జీతాలు ఇస్తామని చెప్పిన సీఎం జగన్మోహన్ రెడ్డి హామీ నిలుపుకోలేకపోయారన్నారు. ప్రజల గొంతు తడుపుకోవడానికి రోజూ నీళ్ల ఇచ్చే పరిస్థితి రాష్ట్రంలో లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. గతంలో తాడిపత్రి ప్రాంతంలో 2వేల నాపరాయి పరిశ్రమలు ఉండేవని, ప్రస్తుత ప్రభుత్వ విధానాలతో అవి 400కు తగ్గిపోయాయన్నారు. ఇందులో పని చేస్తున్న వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయి ఇతర వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా కల్లూరులో నివసిస్తున్న పేదల గుడిసెలు కూల్చుతుంటే అడ్డుకున్నందుకు సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్‌పై పోలీసులు లాఠీఛార్జి చేయడం అత్యంత దుర్మార్గం అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకే సిపిఎం ఆధ్వర్యంలో బస్సుయాత్ర చేపట్టామని తెలియజేశారు. నవంబర్ 15న విజయవాడ వేదికగా భారీ బహిరంగ సభతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దష్టికి ప్రజా సమస్యలను తీసుకెళ్తున్నామని తెలిపారు. ఈ బహిరంగ సభలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు, రైతులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఎం నాయకులు జగన్మోహన్ రెడ్డి, రాజారామ్‌రెడ్డి వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అప్పు చేసిన లక్షల కోట్లు ఎక్కడ..? : ఎంఎ.గఫూర్



గుత్తి బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ఎంఎం.గఫూర్

గుత్తి : వైసిపి ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు అప్పు చేసి సంక్షేమ పథకాలకు రూ.2.50 లక్షలు మాత్రమే బటన్ నొక్కా అందజేసింది మరి మిగతా రూ.7.50 లక్షల కోట్ల సొమ్ము ఎక్కడికెళ్లిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే గఫూర్ ప్రశ్నించారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణభేరి రాష్ట్ర బస్సు యాత్ర బుధవారం రాత్రి గుత్తికి చేరుకుంది. ముందుగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ గాంధీ సర్కిల్ నుంచి గాంధీ కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. కళాకారుల బందం పాటలు పాడి అలరించారు. అనంతరం గాంధీ చౌక్ వద్ద ఏర్పాటైన బహిరంగ సభలో గఫూర్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి వైసిపి ప్రభుత్వం వత్తాసు పలుకుతోందన్నారు. ఎపి రాష్ట్ర విభజనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలను విభజిస్తూ పాలిస్తోందన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ కంపెనీల అప్పగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ అభివద్ధి కోసం పోరాడాల్సింది పోయి మోడీ ప్రభుత్వానికి వైఎస్.జగన్ భజన చేస్తున్నారని చెప్పారు. కరువు ప్రాంతాల్లో రైతన్నలను ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వ, పేదల భూములను ఆక్రమించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లూరులో ఎమ్మెల్యే ఆదేశాలతోనే పేదల గుడిసెలను అర్ధరాత్రి సమయంలో తొలగించారని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు అమరావతి మీద దృష్టి పెట్టి పాలన గాలికి వదిలేసారని చెప్పారు. టిడిపి ప్రభుత్వం మీద మేము వ్యతిరేకంగా పోరాడమని ఆయన గుర్తు చేశారు. ఈనెల 15వ తేదీన విజయవాడలో చేపట్టిన భారీ బహిరంగ సభకు రైతులు, కూలీలు, కార్మికులు, ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, నాయకులు కసాపురం రమేష్, వి.నిర్మల, సాకే నాగరాజు, మారుతి, అవాజ్ కమిటీ నాయకులు షాషావలి, సిపిఎం మండల కార్యదర్శి బి.రామకష్ణ, ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక, కేవీపీఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, సిఐటియు మండల అధ్యక్షుడు ఎం.మల్లేష్, కవిత, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో ర్యాలీగా వస్తున్న సిపిఎం నాయకులు

బస్సుయాత్రలో గేయాలు ఆలపిస్తున్న ప్రజానాట్య మండలి కళాకారులు

కరువు ఎక్కువ.. మండలాలు తక్కువ..!

అధికారిక ప్రకటనపై విపక్షాల పెదవివిరుపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కరువు మండలాల ప్రకటనపై విపక్షాలు పెదవి విరుస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు ఈ ఏడాది ప్రారంభం నుంచే నెలకొన్నాయి. మొత్తం 63 మండలాలుంటే 11 మండలాల్లో సాధారణ వర్షపాతం కనిపిస్తోంది. తక్కిన అన్ని మండలాల్లోనూ వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటువంటి సమయంలో అన్ని మండలాలను కరువు మండలాలు ప్రకటించాలని విపక్షాలు డిమాండ్ చేస్తూ వస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం 35 మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించింది. అనంతపురం జిల్లాలో 28 మండలాలు, సత్యసాయి జిల్లాలో ఏడు మండలాలు కరువు మండలాలుగా ప్రకటించింది. సత్యసాయి జిల్లలో తీవ్ర వర్షాభావ పరిస్థితులున్న లేపాక్షి, రొద్దం మండలాలను సైతం కరువు మండలాలుగా ప్రకటించకపోవడం గమనార్హం. రొద్దం మండలంలో ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే 70 శాతం లోటుంది. ఇక లేపాక్షి మండలంలో 64.1 శాతం వర్షపాతం లోటుంది. ఈ మండలాలకు కరువు మండలాల జాబితాలో చోటు దక్కలేదు. తక్కిన మండలాల్లోనూ సాధారణం కంటే 35 శాతం కంటే అధికంగానే వర్షపాతం లోటుంది. అయినా ప్రభుత్వం ఈ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అనంతపురం జిల్లా కరువు మండలాలు

డీ.హీరేహల్, రాయదుర్గం, కణేకల్, విడపనకల్లు, గుంతకల్లు, గుత్తి, పెద్దవడుగూరు, యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు, పామిడి, వజ్రకరూరు, ఉరవకొండ, గుమ్మగట్ట, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం, ఆత్మకూరు, కూడేరు, గార్లదిన్నె, శింగనమల, పుట్లూరు, నార్పల, బుక్కరాయసముద్రం, అనంతపురం, రాప్తాడు, శెట్టూరు, కుందుర్పి, కంబదూరు.

సత్యసాయి జిల్లాలో కరువు మండలాలు

నంబులపూలకుంట, మడకశిర, అమరాపురం, గుడిబండ, రొళ్ల, అగళి, పరిగి.



అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం 421.9 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 253.8 మిల్లీమీటర్లు మాత్రేమ నమోదయింది. సాధారణం కంటే 39.8 శాతం తక్కువ వర్షపాతం ఈ ఏడాది నమోద య్యింది. సత్యసాయి జిల్లాలో 478.8 మిల్లీమీటర్లు సాధారణ వర్షపాతానికి గానూ 299.2 మిల్లీమీటర్లు మాత్రమే వర్షపాతం నమోదయ్యింది. 37.4 శాతం ఈ ఏడాది వర్షపాతం లోటుంది. రెండు జిల్లాల పరిధిలోనూ అటు ఆరు మండలాలు, ఇటు ఐదు మండలాల్లో మినహా తక్కిన అన్ని మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఖరీఫ్ పంటలు ఇప్పటికే పూర్తిగా దెబ్బతిన్న నేపథ్యంలో ఈ ఏడాది రబీ ఆశలు కూడా సీజన్ ప్రారంభంలోనే ఆవిరవుతున్నాయి. పరిస్థితి ఇంత దయనీయంగా ఉన్నా ప్రభుత్వం కరువు మండలాను తక్కువగా ప్రకటించడం పట్ల సర్వత్రా విమర్శలు నెలకొన్నాయి.

విరాళం అందజేస్తున్న దాతలు

కళ్యాణమండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : నియోజకవర్గ పరిధిలోని రొల్లమండలం కాల్వేపల్లిలో శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి ధర్మ ప్రచార సేవా పరిషత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన కళ్యాణమంటపం నిర్మాణానికి విరాళాలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా హెచ్‌టి. హళ్లి గ్రామానికి చెందిన బండి మారప్ప కుమారులు బి ఎంజారప్ప, బిఎం. శివన్న ఎం నాగేంద్రప్ప రూ. 1.51 లక్షల విరాళాన్ని దేవాలయ కమిటీ సభ్యులకు బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు శ్రీకాంతప్ప, ఆలయ కమిటీ నిర్వాహకులు కాంతరాజు, రాజన్న, శ్రీరంగప్ప, బండి రమేష్, బండి దొడ్డ సిద్ధప్ప, ఎస్ సిద్ధప్ప, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్

ధర్మవరం టౌన్ : కడపలోనే ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో ఈనెల 8వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌ను నిర్వహిస్తున్నట్లు విద్యార్థిసంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్, కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు శివకుమార్, ఎన్‌ఎస్‌యువై జిల్లా అధ్యక్షులు ప్రసాద్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రాజా పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో విలేకరులతో మాట్లాడారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని మోడీ ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడాన్ని నిరసిస్తూ ఈ బంద్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండల నియోజకవర్గ కేంద్రాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. విద్యాసంస్థల బంద్‌కు ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపి సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు శివ, పట్టణ నాయకులు ప్రదీప్, శీన, నగేష్, రాజశేఖర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని పివిఎస్ పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాల కరస్పాండెంట్ నాయుడు, విద్యార్థులకు ఆరోగ్యాలపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు తీసుకువెళ్లారు. ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ రాజేంద్ర విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

లేపాక్షి : ఆటోడ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని ఎస్‌ఐ గోపీ సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతి ఆటోకు రికార్డులతో పాటు ఆటోడ్రైవర్లు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులకు తీసుకు వెళ్లరాదన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రాల తనిఖీ

కదిరి టౌన్ : జిల్లా అధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఐనుద్దీన్, డాక్టర్ బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో పట్టణంలోని హిందూపూర్ రోడ్డు నిజాంవల్లి కాలనీలో ప్రథమ చికిత్స కేంద్రాలను బుధవారం తనిఖీ చేశారు. ఈ మేరకు ప్రథమ చికిత్స కేంద్రాల రిజిస్ట్రేషన్ పత్రాలు, ఆర్‌ఎంపిల అర్హత పత్రాలు పరిశీలించారు. ఆర్‌ఎంపిలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం : బడి మధ్యలో మానేసిన విద్యార్థులు, పది, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులు ఓపెన్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఎంజిఎం హైస్కూల్ హెడ్ మాస్టర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ కోఆర్డినేటర్ అశోక్ కుమార్ తెలిపారు. అంగన్ వాడీ, ఆశా వర్కర్లు, చిరుద్యోగులు, డ్రైవర్లు, గృహిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం సెల్ నంబర్ 9441507754 లో సంప్రదించవచ్చున్నారు.

4న మండల మీట్

గాండ్లపెంట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 4న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న ఎంపిడిఒ రామనాయక్ తెలిపారు. ఎంపీపీ జగన్మోహన్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపిటిసిలు, సర్పంచులు అన్ని శాఖ అధికారులు, సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంజిఎం విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజిఎం పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ జట్లుకు ఎంపిక అయినట్లు పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతు గత నెల 30, 31న అనంతపురం నగరంలోని ఆర్‌డిటి స్టేడియంలో ఎస్‌జిఎఫ్ వారు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొనే అనంతపురం ఉమ్మడి జల్లా జట్టును ఎంపిక చేశారన్నారు. ఈ పోటీల్లో ఎంజిఎం పాఠశాల తరపున ఐదుగురు విద్యార్థులు ప్రతిభ కనపర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పీడీలు లోక్‌నాథ్, సురేష్, విలియమ్స్ శేఖర్, రాణి, ప్రవీణ, ఉపాధ్యాయులు అభినందించారు.

సమ్మె సైరన్ మోగించిన క్లాప్ ఆటో డ్రైవర్లు

సమ్మెతో నిలచిన క్లాప్ వాహనాలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలో ఇంటింటి చెత్త సేకరణ కార్మికుల సమ్మెతో బుధవారం నుంచి చెత్త సేకరణ స్తంభించింది. 5 నెలల నుంచి ఏజెన్సీ నిర్వహకులు క్లాప్ ఆటో డ్రైవర్లకు వేతనాలు ఇవ్వలేదు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన డ్రైవర్లకు న్యాయం జరగలేదు. దీంతో చెత్త సేకరణను ఆపి ఆటో డ్రైవర్లు సమ్మె సైరన్ మోగించారు.

నిలిచిపోయిన చెత్త సేకరణ

క్లీన్ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా వైసీపీ ప్రభుత్వం చెత్త సేకరణ కోసం క్లాప్ వాహనాలను తీసుకువచ్చింది. 2022 ఫిబ్రవరిలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి చెత్త సేకరణ ప్రారంభించింది. ఈ వాహనాలకు డ్రైవర్లను నియమించింది. ఒక్కొక్క వాహన డ్రైవర్‌కు రూ. 18,500లు, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి విధుల్లోకి తీసుకుంది. ఈ నేపథ్యంలో హిందూపురం పట్టణానికి 25 వాహనాలు కేటాయించింది. మొదటి నెల డ్రైవర్‌కు రూ. 8700లు ఇచ్చారు. ఈ ఏడాది నుంచి నెలకు రూ. 10,118లు చెల్లిస్తున్నారు. మిగిలిన రూ. 8వేలు ఎక్కడికి వెళుతోందో తెలియడం లేదు. ఈ సొమ్ము ఏజెన్సీ కాంట్రాక్టర్ జేబులోకి వెళుతోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రైవర్లు తమ వేతనాలు, పీఎఫ్, ఈఎస్‌ఐ గురించి అడిగితే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నారు. హిందూపురం పురపాలక సంఘానికి కేటాయించిన 25 వాహనాల నిర్వహణ బాధ్యతను కడప జిల్లాకు చెందిన రెడ్డి ఎంటర్ ప్రైజెస్ వారికి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ వాహనాలతో ప్రతి రోజు అధికారులు సూచించిన ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణ చేపడుతున్నారు. అయితే ఆరునెలలుగా సిబ్బంది ఇవ్వాల్సిన వేతనాలు ఏజెన్సీ నిర్వహకులు ఇవ్వలేదు. దీంతో క్లాప్ డ్రైవర్లు సమ్మెలోకి వెళ్లారు. వీరి సమ్మెతో పురపాలక సంఘాల్లో చెత్త సేకరణ నిలిచి పోయింది.

ప్రజారక్షణభేరి బస్సుయాత్రను విజయవంతం చేయండి

బస్సుయాత్ర కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణభేరి బస్సు యాత్రను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ ఎస్ వెంకటేష్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గురువారం పామిడి, అనంతపురం, రాప్తాడు, పెనుకొండ, హిందూపురం, పుట్టపర్తి వరకు ఈ బస్సు యాత్ర సాగుతుందన్నారు. పుట్టపర్తికి ఈ యాత్ర రాత్రికి చేరుకొని ఇక్కడే నాయకులు బస చేస్తారన్నారు. 3వ తేదీన నల్లమాడ, కదిరి మీదుగా అన్నమయ్య జిల్లాలోకి ఈ బస్సు యాత్ర ప్రవేశిస్తుందన్నారు. ఈ బస్సు యాత్రలో కేంద్ర, రాష్ట్ర, జిల్లాల సిపిఎం నాయకులు, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం తదితర అనుబంధ సంస్థల నాయకులు పాల్గొంటారన్నారు, ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేయవలసిన ఆవశ్యకత గురించి ఈ బస్సు యాత్ర సందర్భంగా నాయకులు వివరిస్తారన్నారు. ఆయా ప్రాంతాలలో జరిగే బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

పెనుకొండ : సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి రమేష్ కోరారు. బస్సుయాత్రకు సంబందించిన కరపత్రాలను స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. బస్సు యాత్ర గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పెనుకొండలోని అంబేద్కర్ సర్కిల్ కు చేరుకుంటుందని ఈ బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, నాయకులు తిప్పన్న , కిష్టప్ప , బాలు , భూ నిర్వాసితులు వెంకట్రామిరెడ్డి , నారాయణ , శ్రీరాములు, ప్రవీణ, గంగమ్మ , మంగమ్మ , గంగాధర్ , ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలు మంజూరు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు మండలం కోడూరు పంచాయతీ పరిధిలోని 805 సర్వే నెంబర్ జగనన్న లే అవుట్ లో ఇల్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 44 రోజులుగా ఇల్లు లేని నిరుపేదలు ఆందోళన చేస్తున్నా అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడిసెలు వేసుకున్న వారందరూ పేదవాళ్లని ఈ విషయాన్ని ప్రభుత్వమే గుర్తించిందని చెప్పారు. దీనిని అధికారులు విస్మరిస్తున్నారని విమర్శించారు. న్యాయంగా అయితే లబ్ధిదారులుగా గుర్తించిన వారికి 90 రోజులలో పట్టాలు ఇవ్వాలని అయితే ఉద్దేశ్య పూర్వకంగానే వివాదాస్పన స్థలంలో ఇళ్ల పట్టాలు ఇచ్చినట్లే ఇచ్చి లాగేసుకున్నారని అన్నారు. గత మూడున్నర సంవత్సరాలుగా ఆ భూమి కోర్టు పరిధిలో ఉన్నప్పుడు ప్రత్యామ్నాయంగా మరోచోట పట్టాలు ఇవ్వాల్సిన అధికారులు భూమి లేదని కాలక్షేపం చేశారని అన్నారు ఎలాంటి వివాదం లేని 805 సర్వే నెంబర్‌లోని జగన్న లేఅవుట్‌లో స్థలాన్ని గుర్తిస్తే పట్టాలు ఇవ్వడానికి తహశీల్దార్‌కు చేతులు రావడం లేదని అన్నారు. తక్షణమే నివాసయోగ్యమైన భూమిలో గుడిసెలు వేసుకున్న చోట పట్టాలు మంజూరు చేసి గృహాలు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇఎస్ . వెంకటేష్, ప్రవీణ్ కుమార్ వెంకటేష్, లక్ష్మీనారాయణ, రామచంద్ర, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు చందు, సదాశివరెడ్డి, రహంతుల్లా, రియాజ్, చరణ్, మనిస్వామి, నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కదిరి టౌన్

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం చెందిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బిరెడ్డి విమర్శించారు. కదిరి పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం శాస్త్రీయ పద్ధతిలో పరిశీలించి శ్రీ సత్య సాయి జిల్లాలో ఉన్న 32 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఎక్కువ మంది రైతులు ఖరీఫ్ లో వేరుశెనగ, కంది ఇతర పంటలు సాగు చేసారని సకాలంలో వర్షాలు లేక పంటలు ఎండిపోయయని అన్నారు. దిగుబడి లేక పెట్టిన పెట్టుబడి రాక రైతు కుటుంబాలు అప్పుల్లో కూరుకు పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. పంట పెట్టి నష్టపోయిన రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం ప్రతి ఎకరానికి 40 వేల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ఖరీఫ్‌లో పంటసాగు కోసం భూమి చదును చేసుకొని విత్తనాలు, ఎరువులు కొని సకాలంలో వర్షం లేక పంట పెట్టలేని రైతులకు ఎకరానికి 25 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడం వల్ల బోర్లు, బావులు కింద సాగుచేసిన పండ్ల తోటలు, కూరగాయలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి 50వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. అన్ని రకాల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈశ్వర్ రెడ్డి, గంగిరెడ్డి, లక్ష్మానాయక్, రామాసి నాయక్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

నేరాలు ఘోరాలు

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మడకశిర : నియోజకవర్గంలోని అమరాపురం మండలం హేమావతి పంచాయతీ ఉప్పరహట్టి గ్రామానికి చెందిన సతీష్ అనే ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన సుశీలమ్మ సీతారాం దంపతుల కుమారుడు సతీష్ అమరాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలకు ప్రతిరోజు పోవాలని తల్లితండ్రులు గట్టిగా చెప్పడంతో మనస్థాపానికి గురైన సతీష్ విషం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. మడకశిర ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు.

పేకాట జూదరులు అరెస్టు

మడకశిర రూరల్ : మండలంలోని బుల్ల సముద్రం గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 10, 300నగదు స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు. పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బుక్కపట్నం : మండల పరిధిలోని మారాల గ్రామ సరిహద్దులో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నరసింహుడు తెలిపారు. వారి వద్ద నుంచి 20,900 రూపాయలను నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎఎస్‌ఐ రమణ చెప్పారు.

పోలీసుల అదుపులో ద్విచక్ర వాహనాల దొంగలు

కదిరి టౌన్ : ద్విచక్ర వాహనాలు దొంగలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుండి ఏడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కాలంలో వివిధ చోట్ల వరుసగా మోటార్ సైకిళ్ల దొంగతనాలు జరుగుతుండడంతో ప్రత్యేక దృష్టిసారించామన్నారు.కదిరి టౌన్ ఎస్‌ఐ బాబ్జాన్, సిబ్బంది బృందంగా ఏర్పడి కేసు దర్యాప్తు చేపట్టారన్నారు. కదిరి టౌన్ రాయచోటి రోడ్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా హిందూపురానికి చెందిన షేక్ అఫిసుల్లా, అన్నమయ్య జిల్లాకు చెందిన ఆదిల్ ఖాన్ కదిరిలో చోరీ చేసిన ద్విచక్రవాహనంలో వస్తుండగా అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించామన్నారు. దీంతో వారు ద్విచక్రవాహనాలను చోరీ చేసినట్లు అంగీకరించారన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 7 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

బస్సు బోల్తా

గోరంట్ల రూరల్ : ద్విచక్ర వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో బస్సు బోల్తా పడిన సంఘటన గోరంట్ల పట్టణ సమీపంలోని కొత్తచెరువు రోడ్డులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది, పోలీసులు తెలిపిన వివరాలు.. గోరంట్ల మండలంలోని కరావులపల్లి తండా, గుంతపల్లి, మందలపల్లి గ్రామాల నుండి పలువురు యువకులు పెనుకొండ వద్ద గల కియా అనుబంధ సంస్థ ఏ సిటీ కంపెనీలో పనిచేయడానికి ట్రావెల్స్ బస్సులో వెళుతుంటారు. అందులోభాగంగా బుధవారం సాయంత్రం పరిశ్రమలో పనులు ముగించుకొని దాదాపు 12 మంది శ్రీ శ్రీనివాస ట్రాన్స్‌పోర్ట్ బస్సులో బయలుదేరారు. గుమ్మయగారిపల్లి దాటగానే ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ద్విచక్ర వాహనం రావడంతో ఆ వాహనాన్ని తప్పించబోయిన డ్రైవర్ బస్సును పక్కకు తిప్పడంతో వంక లోకి బోల్తా పడింది. అయితే ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవటంతో ఊపిరి పీల్చుకున్నారు. బస్సు బోల్తాపడిన వెంటనే అందులో ఉన్న వారు అద్దం తొలగించి బయటకి వచ్చారు. వారిని మరొక వాహనంలో వారి స్వగ్రామాలకు తరలించారు.

సిఐపై చర్యలకు డిమాండ్

కదిరి అర్బన్ : గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామంలో పేదల గుడిసెల తొలగింపులో జరిగిన ఘటనలో సిపిఎం నాయకులపై అనుచితంగా ప్రవర్తించిన సిఐ నరేంద్రరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి జి ఎల్ నరసింహులు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు బాబ్జాన్ డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన నాయకులను, పేదలను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రూరల్ ఎస్‌ఐగా విజయ్‌కుమార్ నాయక్

ధర్మవరం టౌన్ : ధర్మవరం రూరల్ ఎస్‌ఐగా ఆర్. విజయ్‌కుమార్‌నాయక్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో ఉన్న ఎస్‌ఐ ప్రదీప్ కుమార్ శ్రీ సత్య సాయి జిల్లా ఎస్బి శాఖకు బదిలీపై వెళ్లారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీస్ స్టేషన్ నుండి సాధారణ బదిలీగా విజయ్ కుమార్ నాయక్ ధర్మవరం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కారానిక తనవంతుగా కృషి చేస్తానన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి సత్వరచర్యలు

మడకశిర : ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం నియోజకవర్గ పరిధిలోని రొల్ల మండలంలో పర్యటించారు. ఈసందర్భంగా మల్లినమడుగు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి సన్న మారేగౌడ్, బండి రమేష్, బిజి హళ్లి సర్పంచి రాజన్న, మల్లినమడుగు సర్పంచి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవనం ప్రారంభం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద నూతనంగా నిర్మించిన భవనంలో సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరాములు బుధవారం ప్రారంభించారు. ఇన్నేళ్లు అద్దె భవనంలో ఉన్న సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాన్ని ప్రజలకు అనుకూలంగా పట్టణం నడిబొడ్డున ఉన్న మార్కెట్ లోని మున్సిపల్ కాంప్లెక్స్ భవనంలోకి మార్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌కాచర్ల లక్ష్మి, వైస్ ఛైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్ బేగం, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శీన, కౌన్సిలర్లు మాసపల్లి సాయికుమార్, గోరకాటి పురుషోత్తంరెడ్డి, పెనుజూరు నాగరాజు, జిలాన్ బాషా, సబ్ రిజిస్టర్ రమణరావు తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు ప్రభుత్వాన్ని సాగనంపుదాం : టిడిపి

మాట్లాడుతున్న కందికుంట

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - కదిరి టౌన్

రాష్ట్రంలో కక్షసాధింపు చర్యలు చేపడుతున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. బాబు షూరిటీ– భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కదిరి పట్టణం 24వ వార్డులో కందికుంట ఇంటింటికి తిరుగుతూ వైసిపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలను, టిడిపి మినీ మేనిఫెస్టో అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ముస్తఫా, పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, ఆల్ఫా ముస్తఫా, క్లస్టర్ ఇన్‌ఛార్జి రెడ్డిబాషా, బూత్ ఇన్‌ఛార్జి బాబావలి, నాయకులు కొలిమి అమీన్, భాస్కర్, పీరా, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల పరిధిలోని దామావాండ్లపల్లిలో బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని టిడిపి నాయకులు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ప్రతి ఇంటికి వెళ్లిమినీ మేనిఫెస్టో అంశాలను వివరిస్తూ బాబుతో నేను కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్, తెలుగు యువత మండల అధ్యక్షులు గుత్తా ప్రసాద్, దేరంగుల శ్రీనివాసులు, నాగబయప్ప, రామాంజులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో టిడిపి, జనసేన నాయకులు బుధవారం బాబు షూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు మినీ మేనిఫెస్టో అంశాలను వివరిస్తూ బాబుతో నేను కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, జనసేన పార్టీ కన్వీనర్ కెవి రమణ, బాలసముద్రం ఎంపీటీసీ అమర్ కార్తికేయ, తెలుగుదేశం పార్టీ మాజీ మండల కన్వీనర్ శంకర్ నాయుడు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు నాగభూషణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి మల్లికార్జున, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కనగానపల్లి : మండలకేంద్రంలో టిడిపి నాయకులు బుధవారం బాబు షూరిటీ – భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మిని మ్యానిఫెస్టో లోని పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈకార్యక్రమంలో నాయకులు నెట్టెం వెంకటేష్, నరసింహులు యాదవ్, రంగయ్య, పోతలయ్య, ముత్యాల రెడ్డి, బట్టా సురేష్ చౌదరి, పూజారి రాజకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : చంద్రబాబు నాయుడికి మధ్యంతర బెయిల్ మంజూరు కావటంతో టిడిపి శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. శ్రీ విజయలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్న క్యాంటీన్ వద్ద బంగారు కృష్ణమూర్తి అధ్వర్యంలో చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ : బాబు ష్యూరిటీ – భవిష్యత్తు గ్యారెంటీ అనే కార్యక్రమంతో ప్రజలకు టిడిపి భరోసా ఇస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షులు బికె. పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం నగర పంచాయతీ పరిధిలోని 11,12, వార్డుల్లో బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు సిద్దయ్య, సిద్ధలింగప్ప, టౌన్ కన్వీనర్ రవి శంకర్, నాయకులు కేశవయ్య, లక్ష్మినారాయణ రెడ్డి, రామలింగ, కన్నా స్వామి, హుజూర్,అనసూయమ్మ, చంద్రకాంతమ్మ, నంజుండ, శ్రీనివాసులు,

దళితులకు భూములివ్వాలి

తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలో నాయకులు

ప్రజాశక్తి - లేపాక్షి

మండలంలోని కొర్లకుంట, కొండూరు గ్రామంలో కుశలవ సంస్థ ఆక్రమించిన భూములు దళితులకు పేదలకు ఇవ్వాలని కెవిపిఎస్, భూపోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. పేదలకు భూములు ఇవ్వాలన్న డిమాండ్‌తో రెండోరోజైన బుధవారం కూడా నాయకులు, పేదలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా కెవిపిఎస్ జిల్లాకార్యదర్శి రమణ మాట్లాడుతూ భూమిలేని దళితులకు నిరుపేదలకు భూమి ఇవ్వాలని అదేవిధంగా భూములను అన్యాక్రాంతం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు రికార్డులను సృష్టించి కుశలవ సంస్థ వారికి అనుకూలంగా పనిచేస్తున్న అధికారులపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులు ఆర్థికంగా సామాజికంగా ఎదగాలంటే భూములు ముఖ్యమని అలాంటి భూములు దళితులకు దక్కకుండా చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట కమిటీ అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి రాము, గంగాధరప్ప, నరసింహప్ప, నాగమ్మ, నాగరత్నమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి

ప్రజాశక్తి -పెనుకొండ

సోమందేపల్లి మండలం చిన్న బాబయ్య పల్లి గ్రామానికి చెందిన దళితులు బెల్ కంపెనీ కోసం భూములు కోల్పోయారని భూ నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని వ్యకాసం నాయకులు కోరారు. ఈ మేరకు ఆసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఎఒకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు వెంకట్రాముడు , కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశులు, సిపిఎం మండల కార్యదర్శి రమేష్, కమిటీ సభ్యులు కిష్టప్ప, భూనిర్వాసితులు వెంకట్రాం రెడ్డి, ప్రతాపరెడ్డి, నారాయణ, ఓబులేసు, శ్రీరాములు, గంగమ్మ, మంగమ్మ పాల్గొన్నారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీ పుట్టపర్తి డిపో నుంచి ముదిగుబ్బ రూట్ లో ప్రవేశపెట్టిన గిఫ్ట్ స్కీం కు సంబంధించి ప్రయాణికుల సమక్షంలో లక్కీ డ్రాను డిపో మేనేజర్ ఇనయతుల్లా బుధవారం పుట్టపర్తి బస్ స్టేషన్‌లో తీశారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ గత నెల అక్టోబర్‌లో ఈ స్కీమ్ ముదిగుబ్బ రూట్‌లో ప్రవేశ పెట్టామన్నారు. ప్రయాణికులు ఆర్టీసీలోనే ప్రయాణించాలనే ఉద్దేశంతో ఈ లక్కీ డ్రా ప్రవేశపెట్టామన్నారు. బుధవారం తీసిన డ్రాలో విజేతలు కొత్తకోట రమేష్, ముదిగుబ్బ లికిత, బుక్కపట్నం రాజేంద్రప్రసాద్‌కు బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఐ పెద్దన్న, వివిధ యూనియన్ల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

పెనుకొండలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి ఎమ్మెల్యే నివాళి

హిందూపురంలో పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద దీపిక, తదితరులు

ముదిగుబ్బలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని ఎస్పీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో ఎస్పీ మాధవ్ రెడ్డి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఏవో సుజాత, టైటాస్, నారాయణ, రాజశేఖర్ రెడ్డి , వెంకటేశ్వరరావు, రాజు, ప్రదీప్, డిపిఒ కార్యాలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లు అర్పించారు. అనంతరం ఆర్య వైశ్య సంఘం నాయకులు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు అబ్దుల్ రెహమాన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు చంద్రశేఖర్, ప్రశాంత్ కుమార్, నాగభూషణం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిందని ఆర్యవైశ్యసంఘం నాయకులు పేర్కొన్నారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక, కాలేజ్ సర్కిల్లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొట్టిశ్రీరాములు ప్రాణత్యాగం చేసి ప్రత్యేక రాష్ట్రం సాధించి తెలుగు వారి గుండెల్లో అమరజీవిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు మురళీధర్, కాకుమాని సాగర్, ఒవి. ప్రసాద్, గ్రంథేశ్రీనివాసులు, మోకాగోపీ, రాఘవేంద్ర, పెనుజూరునాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఆదేవిధంగా ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ లక్ష్మీకాంతరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినిలు పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఎమ్మార్సీలో ఎంఇఒలు రాజేశ్వరి, గోపాల్‌నాయక్ పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

కొత్తచెరువు : పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని గ్రంథాలయ అధికారి జయరాం తెలిపారు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని శాఖ గ్రంథాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు మహమ్మద్, రామాచారి, రమేష్, సుబ్రహ్మణ్యం, అటెండర్ మునీరు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆర్యవైశ్య యువజన అధ్యక్షుడు కృష్ణమహేష్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైశ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గోరంట్ల : పట్టణంలో ఎంపీడీవో కార్యాలయం నందు బుధవారం రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘునాథ్ గుప్తా, ఎంపీపీ ప్రమీలమూర్తి, జెడ్పీటీసీ జయరాం నాయక్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : పట్టణంలోనే సాయి నగర్ సచివాలయం వద్ద బుధవారం సచివాలయ ఉద్యోగులు ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుభద్ర నాగేంద్ర, తదతరులు పాల్గొన్నారు.

పెనుకొండ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని బహుజన చైతన్య వేదిక నాయకులు ఘనంగా నిర్వహించారు.పట్టణంలోని తెలుగు తల్లి సర్కిల్‌లో బహుజన చైతన్య వేదిక అధ్యక్షులు,హైకోర్టు న్యాయవాది శివరామకృష్ణ తెలుగు తల్లి విగ్రహమునకు పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక గౌరవ అధ్యక్షులు వెంకటేశులు, ప్రధాన కార్యదర్శి పెనుకొండ రవికుమార్, ఆల్ కౌసర్ అధ్యక్షులు అహమ్మద్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జి మారుతి, మునుమడుగు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేశవరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప,తెలుగు ఉపన్యాసకులు దేవిశెట్టి రామన్న,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పొట్టి శ్రీరాముల త్యాగఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ ఏర్పడిందని ఎమ్మెల్యే సిద్దారెడ్డి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హిందూపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చిన్నమార్కెట్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఇన్‌చార్జ్ దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డిలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ కన్వీనర్ నరేష్, కౌన్సిలర్ ఆసిఫ్, నాగేంద్రమ్మ, వార్డ్ ఇన్‌ఛార్జులు నాగరాజు, కవిత, ఫారుక్, డైరెక్టర్ల జనార్ధన్ రెడ్డి, లక్ష్మీనారాయణ, రవీంద్రుడు, కురుబ భారతి, శ్రీనివాసులు, వెంకటేష్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -పెనుకొండ

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సచివాలయం 5 పరిధిలో గల సెంట్రల్ స్కూల్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సందర్భంగా అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి ఎమ్మెల్యే పూల మాల వేసి నివాళులర్పించారు. జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫరూక్ , మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, వైస్ చైర్మన్లు జయశంకర్‌రెడ్డి, సునీల్, కౌన్సిలర్లు ,ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు, అధికారులు, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్షగా లభించిందని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ వైస్ చైర్మన్లు శంషాద్ బేగం, వేముల జయరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పట్టణంలోని ఎర్రగుంట పార్థసారథి నగర్-2 సచివాలయంలో, శారదానగర్ సచివాలయం, ఎస్‌బిఐకాలనీ సచివాలయంలో వేరువేరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఆనందు, కిరణ్ కుమార్, శివ. కౌన్సిలర్లు కత్తే ఆదిలక్ష్మి, మేడాపురం వెంకటేశు, శంకర తేజస్వర, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

హిందూపురం : ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం ఉచితంగా అందించి....ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక అన్నారు. మంగళవారం పట్టణంలోని 13వ వార్డుకు సంబందించి ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అద్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఇన్‌చార్జ్ దీపిక ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యమిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌మ కమిషనర్ ప్రమోద్ కుమార్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సునీత, అసిపుల్లా, నాగేంద్రమ్మ, లక్ష్మీనారాయణ, శ్రీకాళహస్తి దేవాలయ కమిటీ సభ్యులు రవీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

జగనన్న ఆరోగ్యసురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న దీపిక

గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేద్దాం: జనసేన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పార్టీలోకి చేరిన వారితో చిలకం మధుసూదన్‌రెడ్డి

జనసేన పార్టీని గ్రామ స్థాయినుంచి బలోపేతం చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి నాయకులకు, కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అంతకు ముందు మండలంలోని ఉప్పునేశనపల్లి గ్రామానికి చెందిన సాకే రామాంజినేయులు, సాకేహేమంత్, గుజ్జల రాజు, బాలగొండ గోవర్ధన్, కత్తే ప్రసన్నకుమార్, గుజ్జల వినయ్, సాకే యుగంధర్ తదితరులు చిలకం మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జనసేన పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా చిలకం మాట్లాడుతూ జనసేన పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దిరెడ్డిగారి ఆదర్శ్, చిలకం సుధాకర్‌రెడ్డి, చిగిచెర్ల బాష తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీయడానికే కళాఉత్సవ్ పోటీలు

ప్రజాశక్తి బుక్కపట్నం

విద్యార్థులలోని ప్రతిభను వెలికి తీయడానికే ప్రభుత్వము కళాఉత్సవ్ పోటీలను నిర్వహిస్తోందని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేషనల్ కౌన్సిలింగ్ ఎడ్యుకేషన్లో భాగంగా ఎస్-ఎస్‌సిఇఆర్‌టి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కళా ఉత్సవ పోటీలను ఈనెల 7న ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహిస్తున్నామన్నారు. డాన్స్, ఇన్స్టుమెంట్ మ్యూజిక్, జానపద నృత్యాలు వంటి అయిదు అంశాలకు సంబంధించి పది కేటగిరీలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లాస్థాయిలో ఎంపికైన వారికి రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించి ప్రథమ బహుమతిగా 25 వేల రూపాయల నగదు, ద్వితీయ బహుమతి 20 వేల రూపాయల నగదు, తృతీయ బహుమతి 15,000 నగదు తో పాటు నూతన పార్లమెంటు సందర్శించే అవకాశం కల్పిస్తారని చెప్పారు. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.